మృతురాలి కుటుంబానికి పరామర్శ

బెజ్జూరు, జనవరి 3: మండలంలోని హేటిగూడ గ్రామానికి చెందిన ఎర్నాగి లక్ష్మక్క మంగళవారం రాత్రి మృతిచెందింది. దీంతో బీజేపీ నాయకులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం అందజేసి, మృతురాలి కుమారుడికి దివ్యాంగ పెన్షన్ వచ్చేలా కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో తిరుపతి, అన్నారం,తిరుపతి, అశోక్, జలపతి, తిరుపతి, శంకర్, రాములు, గుండయ్య, రామయ్య, వెంకటి, పోచయ్య, విష్ణుమూర్తి, వినోద్, శ్రీకాంత్, బాబురావు,మహేష్, రాకేష్, అన్నాజి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో ముందుండాలి

సిర్పూర్(టి), జనవరి 3: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ముందుండాలని ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. బుధవారం పోలీసులు మీ కోసంలో భాగంగా పోలీసు స్టేషన్‌లో మండలంలోని డోర్‌పల్లి గ్రామానికి చెందిన వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రాములు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కౌటాల, జనవరి 3: ఈనెల 11న జరిగే సీఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండలాధ్యక్షుడు తిరుపతి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు కార్మికలోకం పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఏడు పేపర్లతో టెన్త్ పరీక్షలు



- ఈ సారి రెండు పేపర్లుగా సామాన్యశాస్త్రం
- వేర్వేరు రోజుల్లో నిర్వహణకు బోర్డు నిర్ణయం
- మార్చి 18నుంచి పరీక్షలు
- జిల్లాలో హాజరు కానున్న 6425 మంది విద్యార్థులు

ఆసిఫాబాద్, జనవరి 3: విద్యాసంవత్సరం 2023-24నికి పదో తరగతికి సంబంధించి ఏడు రోజులు ఏడు పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన టైం టేబుల్‌ను డిసెంబరు 30న బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలు ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.3గంటల వరకు కొనసాగనున్నాయి. సాధారణంగా కరోనాకు ముందు టెన్త్‌లో 11 పరీక్షలు జరిగేవి. కరోనా తరువాత 2021-22 సంవత్సరానికి కూడా 11పరీక్షలను నిర్వహించారు. అనంతరం గత సంవత్సం 2022-23ఆరు సబ్జెక్టులకుగాను ఆరు పేపర్లకు కుదించి పరీక్షలు నిర్వహించారు. ఇందులో సామాన్యశాస్త్రం పరీక్షను మాత్రమే రసాయన, భౌతికశాస్త్రం సంబంధించి ఒక పేపర్ ఇచ్చి అది రాసిన వెంటనే జీవశాస్త్రానికి సంబంధించిన మరో పేపర్ ఇచ్చి విద్యార్థులతో వెనువెంటనే పరీక్ష రాయించారు. దీంతో గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో చాలావరకు సామాన్య శాస్త్రం పరీక్షలో విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. దీంతో ఈ సారి సామన్య శాస్త్రానికి సంబంధించి పరీక్షలు వేర్వేరు రోజుల్లో రెండు పేపర్లుగా నిర్వహించనున్నారు. ఫలితంగా ఈ విద్యాసంవత్సరంలో టెన్త్‌కు ఏడు పరీక్షలు జరగనున్నాయి.

170 స్కూళ్లు.. 6425 మంది విద్యార్థులు..

2023-24 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలో 170 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మొత్తం 6425మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో బాలురు 3224, బాలికలు 3201మంది ఉన్నారు. ఆయా విద్యార్థులు గత సంవత్సరం మాదిరిగా కాకుండా ఈ సారి సామాన్య శాస్త్రం రెండు పేపర్లను వేర్వేరు రోజుల్లో పరీక్ష రాయనున్నారు. దీంతో విద్యార్థులు సులభంగా సామాన్య శాస్త్రం పరీక్ష రాసేందుకు వీలు కలగనుంది.

గతేడాది 76.36 శాతం ఉత్తీర్ణత..

జిల్లాలో గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 76.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులు గత ఏడాది 6628 మంది పరీక్షకు హాజరు కాగా అందులో 5061 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

టెన్త్ పరీక్షలకు ఏడు పేపర్లు..

ఎం ఉదయ్‌బాబు, ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి



పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఈ ఏడాది ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహించేందుకు బోర్డు నిర్ణయించింది. సామాన్య శాస్త్రంలో రెండు పేపర్లుగా పరీక్షను నిర్వహించేందుకు టైం టేబుల్ విడుదల చేసింది. జిల్లాలో 6425 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

గురుకులాల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 3: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హేమంత్‌బోర్కడే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సాంఘికసంక్షేమ గురుకులాల అధికారులతో ప్రవేశపరీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్ల ఆవిష్కరించారు. ఫిబ్రవరి 11న 11నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల6లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2023-24విద్యాసంవత్సరంలో 4వతరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. చదువుతున్నట్లుగా సంబంధిత ధ్రువపత్రాన్ని జత పర్చాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీవో స్వరూపరాణి, డీసీవో బాలరాజు, ప్రిన్సిపాళ్లు సంధ్యారాణి, జ్యోతి, శ్రీనాథ్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, జనవరి 3: మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం షీటీం,యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పని చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని ధైర్యంగాముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాల విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు గురైతే జిల్లాషీ టీంమొబైల్ నెం. 8712670564, లేదా డయల్ 100కు సంప్రదించాలన్నారు.

సావర్‌ఖేడ ఉపాధ్యాయురాలికి సావిత్రిబాయి పూలే అవార్డు

కెరమెరి, జనవరి 3: మండలంలోని సావర్‌ఖేడకు చెందిన ఉపాధ్యాయురాలు కడేర్ల వీణ సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపికైనట్లు అఖిలభారతీయ మాలిమహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే తెలిపారు. ఈనెల 7న నాగ్‌పూర్‌లో జరిగేకార్యక్రమంలో ఆమె అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.



వీణ

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 3: జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసంలో మంగళవారం రాత్రి అయ్యప్ప పడిపూజ కన్నుల పండువగా నిర్వహించారు. కోవ సోనేరావు, లక్ష్మి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. మంచిర్యాలకు చెందిన కాలు బృందం భవనఅధ్యంతం భక్తులను అలరించింది. స్వామికి పల్లకీసేవ చేస్తూ మాలధారణ భక్తులు పేటతుల్లి ఆటలతో హోరెత్తించారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీఎమ్మెల్సీ పురాణం సతీష్ దంపతులు, నాయకులు మర్సుకోల సరస్వతి, కోవ సాయినాథ్, జడ్పీటీసీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ చావర్ సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్, జనవరి 3: ఫాతిమా కాన్వెంటు చర్చి వ్యవస్థాపకుడు ఫాదర్ చావర్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. బుధవారం ఫాతిమా కాన్వెంటులో ఫాదర్ చావర్ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి చర్చి పక్కనే పాఠశాలను ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యేను పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు..

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. బోథ్ మాజీ ఎమ్మెల్యేరాథోడ్ బాపురావు ఎమ్మెల్యే హరీష్‌బాబును కలిసి ఘనంగా సన్మానించారు.

ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 3: ఓటరు జాబితా సవర కార్యక్రమం-2024 ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు కె సురేష్, కదం సురేష్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు, రాజకీయ పార్టీల ప్రతి నిధులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రాజకీయపార్టీలు బూత్‌స్థాయిలో ఏజెంట్లను నియమించాలని, రేషనలైజేషన్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్లు ఇతర ప్రాంతాల్లో ఓటువేసే వారు ఫారం నెం.8 నింపడం ద్వారా ఓటరు కేంద్రం మార్పునకు అవకాశం కల్పించామని తెలిపారు. రెండు కిలోమీటర్ల పరిధిదాటిన ప్రాంతాల్లో వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సిర్పూర్ నియోజకవర్గ పరిధిలో 27, ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో 52సహాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈనెల20,21 తేదీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 18సంవత్సరాల వయస్సు దాటిన ప్రతిఒక్కరూ ఓటరుజాబితాలో తమవివరాలు నమోదు చేసుకునే విధంగా రాజకీయపార్టీలు సహకరించాలన్నారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతి నిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

జైనూర్, జనవరి 3: పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రంలో విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపుకలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ పాఠశాలలో ప్రాథమికస్థాయి నుంచి విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు. అదేవిధంగా పదవతరగతి వార్షికపరీక్షలకు విద్యార్థులను అన్నివిధాలుగా సన్నద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులకు విషయాల వారీగా అవగతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కుడ్మేతసుధాకర్, హెచ్ఎం జాదవ్ మధు కర్, సెక్టోరల్ అధికారులు సుభాష్, భరత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్పీఎం కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు న్యాయం జరగాలి



మాట్లాడుతున్న ట్రేడ్‌యూనియన్ నాయకులు

కాగజ్‌నగర్, జనవరి 3: ఎస్పీఎం కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు న్యాయం జరగాలని ట్రేడ్‌యూనియన్ నాయకులు సూర్యప్రకాష్, షబ్బీర్‌హుస్సేన్ డిమాండు చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ ఎస్పీఎం కోఆపరేటివ్ సొసైటీలో కార్మికుల డబ్బులు కాజేశారన్నారు. దీనిపై తాము గతేడాది నవంబరు 18న జిల్లా సహకార సంఘం అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. దీంతో బుధవారం కోఆపరేటివ్ సొసైటీ బాధ్యుడైన రమేష్‌కు అధికారులు నోటీసు జారీ చేశారన్నారు. ఎస్పీఎం కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు న్యాయం జరగాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన బాట పడుతామన్నారు. సమావేశంలో సొసైటీ సభ్యులు డి శంకరయ్య, ఏకే సింగ్, నాందేవ్, ఎండీ షబ్బీర్, సునీల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించాలి

- మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే



మాట్లాడుతున్న సుకుమార్ పెట్కులే

బెజ్జూరు, జనవరి 3: మాలి కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్పించాలని అఖిల భారత మాలి సంఘం రాష్ట్ర అధ్య క్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, హైదరాబాద్‌లో ప్రగతిభవన్‌కు జ్యోతిరావు పూలే ప్రగతిభవన్‌గా మార్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలి కులస్తులకు అవకాశం వచ్చినచోట పోటీచేయాల్సిన అవసరం ఉంద న్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంరావు, గోపాల్, రామకృష్ణ, అశోక్, సురేష్, మోహన్, గోపాల్, బాబురావు, వసంత్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

సిర్పూర్(టి), జనవరి 3: మండల కేంద్రానికి చెందిన సాన ఊశన్న పెద్దకుమారుడు సాన తిరుపతి(38) మిస్సింగ్ కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. రెండురోజుల క్రితం బజార్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంటినుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బుధవారం బాధితుడి తండ్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన జీఎం



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీఎం మనోహర్

మందమర్రి టౌన్, జనవరి 3: చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని మందమర్రి జీఎం మనోహర్ బుధవారం మంచిర్యాలలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే మందమర్రిలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్మిక సంక్షేమానికి కృషిచేయాలని కోరారు. తమ ప్రభుత్వం సంస్థ ప్రగతికి, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని బుధవారం మంచిర్యాలలోని ఆయన నివాసంలో మందమర్రి ఐఎన్‌టీయూసీ నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యల సాధన కోసం పనిచేస్తూ ముందుకు వెళ్తే కార్మికులే ఆదరిస్తారని పేర్కొన్నారు.

కార్మికుల హక్కులే ధ్యేయంగా పనిచేస్తాం

మందమర్రి టౌన్, జనవరి 3: సింగరేణిలో కార్మిక హక్కులే ధ్యేయంగా పనిచేస్తామని ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఏరియాలోని కేకే5గనిపై ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయిస్తామని తెలిపారు. ఇటీవల కేకే5 గనికి చెందిన ఓవర్‌మెన్ ట్రాన్స్‌ఫర్ విషయంలో సీఐటీయూ నాయకులు తమ యూనియన్‌పై చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు బీమనాధుని సుదర్శన్, కంది శ్రీనివాస్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, జనవరి 3: సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ కార్మికులు బుధవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్యకు విన్నవించారు. హైదరాబాద్‌బాద్‌లోని ముగ్దూమ్ భవన్‌లో సీతారామయ్యతోపాటు ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఉప ప్రధానకార్యదర్శి కె వీరభద్రయ్యను రిటైర్డ్ కార్మికసంక్షేమసంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతిమూడేళ్లకోమారు పెన్షన్‌ను సవరించాలని, అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని, ముఖ్య నగరాల్లో నెలవారీ మందుల పంపిణీకి ఏర్పాట్లుచేయాలని, తదితరసమస్యలను ఏఐటీయూసీ నాయకులకు వివరించారు.

సింగరేణిని దేశంలో అగ్రగామిగా నిలుపుతాం: సీఎండీ



నూతన సీఎండీ ఎన్ బలరాం

శ్రీరాంపూర్, జనవరి 3: సింగరేణిని దేశంలో అగ్రగామిగా నిలుపుతామని నూతన సీఎండీ ఎన్ బలరాం అన్నారు. బుధవారం ఆయన సింగరేణి భవన్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడారు. సీఎండీగా తనను నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగనులు ప్రారంభించడంతోపాటు సోలార్, థర్మల్ విద్యుత్ కేంద్రాలను విజయవంతంగా నడిపిస్తూ బొగ్గుకొరత లేకుండా చూస్తామన్నారు. కార్మిక సంక్షేమం, రక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. 70మిలియన్ టన్నుల బొగ్గుఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. లక్ష్యసాధనకు ఉద్యోగులు, అధికారులు సహకరించాలని కోరారు.

సీఎండీకి అభినందనల వెల్లువ..

సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరామ్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. మాజీడైరెక్టర్(ఫైనాన్స్, పర్సనల్) పవిత్రన్ కుమార్, ఉత్తరప్రదేశ్‌కేడర్ అధికారి శ్రీనివాస్, సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ చైర్మన్, కోలిండియా డైరెక్టర్(టెక్నికల్) వీరారెడ్డి, సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వికే శ్రీనివాస్, జి వెంకటేశ్వర్ రెడ్డి, ఈడీ(కోల్‌మూమెంట్)అల్విన్, జీఎం (కోఆర్డినేషన్) ఎం సురేష్, జీఎం(రక్షణ) గురువయ్య, సింగరేణి అధికా రులసంఘం ప్రధానకార్యదర్శి రాజశేఖరరావు, అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నూతన గనులు ప్రారంభించాలి

శ్రీరాంపూర్, జనవరి 3: సింగరేణి సంస్థలో నూతన గనులు ప్రారంభించాలని శ్రీరాంపూర్‌ఏరియా ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్‌కుమార్ కోరారు. శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఎండీకి అభినందనలు అని, ఆయనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలో డిస్మిసల్ కార్మికులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని, డిపెండెంట్ల వయోపరిమితిని 35నుంచి 40ఏళ్లకు పెంచాలని కోరారు. ఇంకాఅనేకపెండింగ్ సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేందుకు సీఎండీ కృషి చేయాలని విన్నవించారు. సమావేశంలో ఎస్‌టి సంఘం అధ్యక్షుడు ధరావత్ రాజేష్, సుమన్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాల పెంపునకు ప్రణాళికలు

మందమర్రి టౌన్, జనవరి 3: సింగరేణిలో 2023-24ఆర్థికసంవత్సరానికి నిర్దేశించిన వార్షికఉత్పత్తి లక్ష్యాలసాధనకు యాజమాన్యం ప్రధాన దృష్టి సారించింది. సింగరేణి వ్యాప్తంగా 11ఏరియాలకు 78మిలియన్ టన్నుల టార్గెట్ నిర్దేశించింది. 3నెలల్లో ఏరియాలవారీగా లక్ష్యాలను పెంచడంతో పాటు అదనపుఉత్పత్తి సారించాలని ప్రధాన దృష్టి కేంద్రీకరించింది.

సీఎండీ బదిలీతో సింగరేణికి విముక్తి



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 3: సీఎండీ శ్రీధర్ బదిలీతో సింగరేణి సంస్థకు విముక్తి లభించిందని సింగరేణి కోల్ మైన్స్‌కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సీఎండీ బదిలీని పురస్కరించుకొని సీసీసీలో ర్యాలీ నిర్వహించి తెలంగాణతల్లి విగ్రహం వద్ద టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ ఆర్థికంగా చిక్కిశల్యమవడానికి శ్రీధర్ కారణమని ఆరోపించారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, అల్లంకి వసంతరావు, పాగిడి శ్రీకాంత్, మంద కమలాకర్, కాంపల్లి తిరుపతి, మంచాల రమేష్, వంశీకృష్ణ, మోహన్, రాజు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి ఐఎన్‌టీయూసీ

శ్రీరాంపూర్, జనవరి 3: తాము ఎల్లవేళలా కార్మికుల పక్షాన పోరాడుతామని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. ఆర్కే6 గనిలో బుధవారం చేపట్టిన భరోసాయాత్రలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా తాము అధికారంలో లేకున్నా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అందుకే కార్మికులు తమను ఆరు ఏరియాల్లో గెలిపించారని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, జాతీయసమితి సభుడు భీమ్‌రావు, ల్యాగల శ్రీనివాస్, జె నర్సింగ్, రామచందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 3: జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సిడాం దత్తును మంగళవారం ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకటరమణ, అసోషియేషన్ సభ్యులు ఆయన స్వగృహంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటేష్, లచ్చన్న, అంజమ్మ, నూర్‌సింగ్, అజ్మీరా దిలేష్, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కస్టోడియల్ డెత్‌పై 12న న్యాయ విచారణ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 3: జిల్లాలోని బెల్లంపల్లి మండలకేంద్రానికి చెందిన కీర్తి అంజి కస్టోడియల్ డెత్‌పై ఈనెల 12న ఉదయం11 గంటలకు ఆర్డీవో కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు మంచిర్యాల ఆర్డీవో రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ

లక్షెట్టిపేట రూరల్, జనవరి 3 మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలో బుధవారం అమ్మ ప్రథమ చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో నిర్వాహ కులు వైద్యుడు సంతపూరి రాజు సుమారు వంద మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా లక్షెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్ హాజరై దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలి తీవ్రత దృష్టిలో పెట్టుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న సంతపూరి రాజును వారు అభినందించారు. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న 317 జీవో బాధితులు

ఏసీసీ, జనవరి 3: జీవో 317 ద్వారా జరిపిన బదిలీల్లో స్థానికతను కోల్పోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని 317 జీవో బాధితుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బాధితులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం 10 జిల్లాలను 33 జిల్లాలుగా విభజించి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి 317 జీఓను జారీ చేసి బదిలీలు చేపట్టిందన్నారు. లోపభూయిష్టమైన జీవో వల్ల తాము స్థానికతను కోల్పోయి ఇతర జిల్లాలు, జోన్లకు బలవంతంగా బదిలీ అయ్యామన్నారు. ఈ జీవోతో తమకు నష్టం జరిగిందని ఎన్నిసార్లు విన్నవించినా, బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, హరి, స్వరూప, దత్తాత్రి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండ్

జైపూర్, జనవరి 3: మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపైనే వేచి చూడాల్సి వస్తోంది. మండల కేంద్రంలో జాతీయ రహదారికి అనుకొని సుమారు రూ.5లక్షలతో చేపట్టిన మినీ బస్టాండ్ వాడుకలోకి తేకపోవడంతో పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారింది. జైపూర్ మండలం నుంచి వివిధ పనుల నిమిత్తం మంచిర్యాల, చెన్నూర్, వివిధ మండలాలకు పనుల నిమిత్తం ప్రజలు వెళ్తుంటారు. ఈ క్రమంలో చంటి పిల్లలతో కుటుంబ సభ్యులు ఎండలోనే వేచి చూడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల గెలుపొందిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ఆర్టీసీ అధికారులతో మాట్లాడి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మందమర్రి టౌన్, జనవరి 3 : ఇటీవల నూతనంగా ఎన్నికైన సింగరేణి సివిల్ కాంట్రాక్టు అసోసియేషన్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూసింగరేణి సివిల్ కాంట్రాక్టర్లందరు కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే హాజరవుతానని చెప్పారు. అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఎన్నికైన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగమల్లేష్, పార్టీ నాయకులు, కమిటీ నాయకులు గోమాస వెంకటేశ్వర్లు, దుర్గం నరేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

కన్నెపల్లి, జనవరి 3: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని సాలిగామ్ మేరిమాత స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారని అన్నారు. బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని, ఇతరాత్ర ఆశచూపి డబ్బులకు ఎర వేస్తారని తెలిపారు. తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. అన్‌లైన్ ద్వారా లావాదేవీలు చేసే వారు కొత్త వ్యక్తుల మాటలు నమ్మరాదని, వారు పంపిన లింకులను ఓపెన్ చేస్తే మొదటికే మోసం జరుగుతుందన్నారు. సైబర్ నేరాలకు గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జికి సన్మానం


దీపాదాస్‌ను సన్మానిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

ఏసీసీ, జనవరి 3: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు బుధ వారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వంగా కలిసి సత్కరించి, తిరుపతి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌తో కలిసి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూ హాలపై చర్చించారు.
















సావిత్రీబాయి పూలేకి ఘన నివాళి



మంచిర్యాలలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 3: జిల్లా వ్యాప్తంగా సామాజిక సంస్కర్త సావిత్రీబాయి పూలేకి బుధవారం ఆమె జయంతిని పురస్కరించుకుని ఘన నివాళులు అర్పించారు. బడుగుల విద్యకోసం పోరాడిన ధీశాలి సావిత్రీబాయి అని బీసీ సంఘం ఐక్యవేదిక, సామాజిక న్యాయ వేదిక జిల్లాకన్వీనర్ రంగు రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలో సావిత్రీబాయి చితపటటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గణపతిరెడ్డి, దుర్గం రాజేశం గౌడ్, విశ్వం, నరేందర్ పాల్గొన్నారు. కాగా చార్వాక ట్రస్ట్‌హాల్‌లో ఉపాధ్యాయురాల్లను ఘనంగా సన్మానించారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్, గౌరవాధ్యక్షుడువిష్ణువర్ధన్‌రావు సావిత్రీబాయి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గుణ, గాజుల ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ: మహిళలు సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని మంచిర్యాల మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉపనిశధ్వని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని హాల్‌లో నిర్వహించిన సావిత్రీబాయిలే జయంతి వేడుకల్లో పాల్గొని వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముకేశ్ గౌడ్, పల్లె భూమేష్, అడ్వకేట్ కొత్త సత్తయ్య, అడ్వకేట్ పద్మ, అత్తి సరోజ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ రాధిక, మేరుగు మహేశ్వరి, బండి పద్మ, అనూష, నీలి శ్రీనివాస్, నరెడ్ల శ్రీనివాస్, వైద్య భాస్కర్, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో వెరబెల్లి రఘునాథ్ సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

శ్రీరాంపూర్: విద్యతో నాటి సమాజానికి సావిత్రీబాయి నిర్దేశం చేశారని జీఎం బి సంజీవరెడ్డి కొనియాడారు. జీఎం కార్యా లయంలో ఆ మె చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం మాటా_డారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం కె. రఘుకుమార్, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: పట్టణంలోని జాతీయ రహదారి నార్లాపూర్ బస్టాండ్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, ప్రతాప్, వెల్డి ప్రభాకర్, కె చిన్నగట్టయ్య, ఏనుగుల బీరయ్య, సత్యనారాయణ, కొలిపాక శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్, మేసినేని మనోహర్, సత్యం, శేషు, రాములు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సావిత్రీబాయి పూలే జయంతిని టీచర్స్ డేగా ప్రకటించాలని భారత్ బచావో నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎండి ఇబ్రహీం, మాజీ తెలంగాణ జేఏసీ చైర్మన్ శ్రీనివాస్‌ర అన్నారు. బుధవారం రాత్రి మార్కెట్ సెంటర్‌లో సావిత్రీబాయి జయంతి వేడుకలను నిర్వహించారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణ పురగిరి క్షత్రియ పెరిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆకిరెడ్డి శంకర్, జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, పెరిక సంఘం నాయకులు తొంగల రాజేశం, తొంగల శ్రీనివాస్, బగ్గని శేషుకుమార్, కందుల రాజన్న, యువజన నాయకులు సాగర్‌వర్మ, మీస రమేష్, అచ్చ శివ తదితరలు పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని కేజీబీవీ పాఠశాల, గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలతో పాటు పలు గ్రామాల్లో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్ కేజీబీవీలో ఎస్‌ఓ ఫణిబాల ఆధ్వర్యంలో చిత్రపటానికి పూమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మందమర్రిలో పూల మాల వేస్తున్న నాయకులు

దండేపల్లి: మండల వ్యాప్తంగా సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు విద్యార్థులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఎంపీపీ పాఠశాలతో పాటు తాటిగూడం దిశ మోడల్ స్కూల్‌లో సావిత్రీబాయి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పల్లె మల్లయ్య, కొమ్ముల బాపు, అడె జంగు, సంద్ర భూమయ్య, మడావి వెంకటేష్, గడ్డం శిరిష, తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: కోటపల్లి మోడల్ స్కూల్‌లో బుధవారం సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. షెట్‌పల్లి పాఠశాలలో హెచ్‌ఎం బుచ్చన్న ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. మహిళా టీచర్లను సన్మానించారు.

భీమారం: మండల కేంద్రంలో సావిత్రీబాయి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొడేటి రవి, లక్ష్మణ్, శడంశెట్టి రమేష్‌తో పాటు పలువురు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విశ్వంభర్, డీటీ కృష్ణ, ఆర్ఐ స్రవంతి, మండల సర్వేయర్ నాగరాజుతో పాటు పలువురు సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఎల్ఎస్ చౌహాన్

- రెమ రాజేశ్వరి ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ



చౌహాన్

కోల్‌సిటీ, జనవరి 3: రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఎల్ఎస్ చౌహాన్ నియమితులయ్యారు. జోగులాంబ జోన్ -7 డీఐజీగా పని చేస్తున్న ఆయనను రామగుండం పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి ఆదేశాలు జారీ చేశారు. రామగుండం సీపీగా పని చేస్తున్న రెమ రాజేశ్వరి ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీగా బదిలీ అయ్యారు. ఎల్ఎస్ చౌహాన్ 2009బ్యాచ్ ఐపీఎస్ అధికారి. రామగుండం కమిషనర్‌గా నియమితులైన ఎల్ఎస్ చౌహాన్ గతంలో గోదావరిఖని సబ్ డివిజన్ డీఎస్పీగా పని చేశారు. 2001నవంబరు 4వ తేది నుంచి 2004 జూన్ 2వ తేది వరకు ఆయన డీఎస్పీగా పని చేశారు. తూర్పు డివిజన్‌లో మావోయిస్టు కార్యకలాపాలు తీవ్రంగా ఉన్న సమయంలో ఆయన ఇక్కడ డీఎస్పీగా సమర్థవంతంగా పని చేశారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పలు కీలక కేసుల పరిష్కారంలో ఆయన ప్రతిభ కనబరిచారు. సమర్థవంతమైన అధికారిగా పేరున్నది.

ముగిసిన కమిటీల కాలపరిమితి

- ఎన్నికలు నిర్వహించక పోవడంపై సభ్యుల అసంతృప్తి

నస్పూర్, జనవరి 3: జిల్లాలో టీఎన్‌జీవోఎస్ ఆరు యూనిట్ల కమిటీలకు, జిల్లా కార్యవర్గానికి నవంబరుతో కాలపరిమితి ముగిసింది. ఎన్నికల నిర్వహించాల్సి ఉన్న కూడా కాలయాపనచేస్తున్నరని సభ్యులు అసంతృప్తి చెందుతున్నారు. మంచిర్యాల యూనిట్‌లో 300 మంది సభ్యులు, లక్సెటిపేటలో 120 మంది, మందమర్రిలో 94 మంది. చెన్నూరులో 107 మంది, బెల్లంపల్లిలో 112 మంది, కన్నెపల్లి యూనిట్‌లో 67 మంది సభ్యులున్నారు. కాగా మంచిర్యాల జిల్లా కమిటీలో ఒక నలుగురు మాత్రమే పెత్తనం చెలాయిస్తూ నిబంధనలు పాటించడం లేదని సభ్యులు అసంతృప్తి చెందుతున్నారు. ఈ విషయంపై టీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీహరిని వివరణ కోరగా సంఘంలో బైలాస్ ప్రకారమే కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పారు. లెక్కలు పక్కాగా సభ్యులకు వివరిస్తున్నామని తెలిపారు. మరో నెల రోజుల్లోగా జిల్లాలోని ఆరు యూనిట్లకు ఎన్నికల నిర్వహిస్తామని తెలిపారు. నలుగురు మాత్రమే పెత్తనం చేస్తున్నరనేది వాస్తవం కాదన్నారు. తమపై కొందరు బురద జల్లె ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి యువకుడి దుర్మరణం

లక్షెట్టిపేట రూరల్, జనవరి 3: మండలంలోని ఎల్లారం గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన తీగల నరేష్ (34) వ్యవసాయ భూమిలో ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో చదును చేశాడు. అనంతరం ట్రాక్టర్‌ను పొలంలోనే నిలిపి ఆన్‌లో ఉండగానే కిందకు దిగుతున్నాయి. ఈ సమయంలో అతడి చొక్కా గేర్‌కు చిక్కుకుని ముందుకు కదిలింది. దీంతో అతడు అదుపుతప్పి ట్రాక్టర్ టైర్ కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై పొలంలోనే ప్రాణాలు వదిలాడు. ఎస్సై లక్ష్మణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నెన్నెల, జనవరి 3: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి శ్రీకాంత్ (29) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఇన్‌చార్జీ ఎస్సై శ్రీనివాస్ తెలిపిన ప్రకారం వివరాలు.. కొంత కాలంగా శ్రీకాంత్ మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో ఈ నెల 1న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి శ్రీకాంత్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలి

లక్షెట్టిపేట రూరల్, జనవరి 3 రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ ఆదేశించారు. లక్షెట్టిపేట మండలంలోని ఎల్లారం గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నందున ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పింగళి శ్రీలతరమేష్, తహసిల్దార్ రఘునాథ్‌రావు, ఎంపీడీవో వరప్రసాద్, ఏవో ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగళి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి

శ్రీరాంపూర్, జనవరి 3: సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై కె రాజేశ్ అన్నారు. జాగృతి దివస్‌ను పురస్కరించుకొని శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుళ్లు సంపత్, బాలకృష్ణ, గంగాధర్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

లక్షెట్టిపేట రూరల్, జనవరి 3: యువతకు క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని లక్షెట్టిపేట సీఐ కృష్ణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నాటు వేస్ట్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ మహంకాళి ఐతీష్ ఆధ్వర్యంలో టి-10 కప్ షెషన్-2 క్రికెట్ టోర్నమెంట్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్ పాల్గొని క్రీడాకారులను కరచాలనం చేసి పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో మహంకాళి రాజేష్, మున్సిల్ కౌన్సిలర్లు సురేష్ నాయక్, చింత సువర్ణఅశోక్ కుమార్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ అలీ, కేతిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, రాందేని చిన్న వెంకటేష్, ఆర్గనైజర్ చింత అభినయ్, దండి అనీల్‌కుమార్, చిన్న రమేష్, కాన్నివడా రాము, కుమార్, బాబా, జావీద్, శ్రీధర్, బాసిత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో ఆశాకిరణం

● **నేడు లూయి బ్రెయిలీ జయంతి**

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 3: పుట్టుకతో కంటి చూపు కోల్పోయిన వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు లూయి బ్రెయిలీ రూపొందించిన లిపి వారి జీవితాల్లో ఆశాకిరణంగా మారింది. కళ్లు కనిపించని వారు చదివేందుకు మనసులోని భావాలు వర్ణించేందుకు అవసరమైన భాషను తయారు చేసింది లూయి బ్రెయిలీ. అంధుల కోసం బ్రెయిలీ లిపిని రూపొందించారు. లూయి బ్రెయిలీ1809 జనవరి4న పారిస్ లోని క్రూవే గ్రామంలో జన్మించారు. ఆయన జన్మదినాన్ని ప్రపంచ బ్రెయిలీ దినోత్సవంగా జరుపుకుంటారు. తన తండ్రి తయారు చేస్తున్న గుర్రం జీన్ల దగ్గరికి వెళ్లి ఆడుకునే సమయంలో కత్తిమొన కన్నుకు తగిలిమూడేళ్ల వయస్సులోనే ఒక కన్ను పోయింది. తర్వాత రెండవ కన్ను కూడా పోయింది. కళ్లులేని లూయికి చదువంటే చాలా ఇష్టం. తన లక్కతో కలిసిస్కూలుకి వెళ్లేవాడు. అక్కడ విన్న పాఠాలన్నీ ఇంటికొచ్చి చెబుతుండేవాడు. చదువు పట్ల లూయికి ఉన్న ఆసక్తిని గమనించిన అతడి తండ్రి చిన్న మేకులతో ఒక చెక్కపై అక్షరాలుగా చేసి లూయిచేతులతో చదివించేవాడు. లూయికి మంచి గ్రహణ శక్తి ఉండడం వల్ల పాఠశాలల్లో ఉపాధ్యాయుల మన్ననలు పొందేవాడు. పదో ఏట పారిస్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్‌ఫర్‌దిబ్లైండ్..స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యాడు. లూయి తాను చదువుకున్న పాఠశాలలోనే తన17 వేట ఉపాధ్యాయుడయ్యాడు. అప్పట్లో అంధులకు శిక్షణ ఇచ్చేవాడు. కాగా లూయి బ్రెయిలీ చదువు చెబుతూనే సులభమైన రీతిలో అంధులు చదువుకునేలా, రాయగలిగేలా అక్షరమాలను రూపొందించాలని భావించారు. అలా ఆరు అక్షరాలతోనే సులభగా, తేలికగా ఉండే లిపిని కనిపెట్టారు. అంధులు రాయడం, చదవడం ద్వారా ఈలిపికి అంతర్జాతీయ గుర్తింపు కూడా లభించింది. బ్రెయిలీ సుదీర్ఘ పోరాటం అనంతరం అంధులకు చేరింది. అంధులకు విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేసి జీవితాన్ని అంకితం చేసిన లూయి బ్రెయిలీ 1852 జనవరి6న అనారోగ్యంతో కన్నుమూశారు.

న్యాయం చేయాలి

- డిప్యూటీ సీఎంకు శేజల్ వినతి

బెల్లంపల్లి, జనవరి 3: మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనను లైంగిక వేధింపులకు గురి చేశాడని పలు మార్లు ప్రభుత్వం, పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, తనకు న్యాయం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆరిజన్ డెయిరీ సీఈవో బోడపాటి శేజల్ విన్నవించుకున్నారు. బుధవారం ఆమె హైదరాబాదులో డిప్యూటీ సీఎంను కలిశారు. లైంగిక ఆరోపణల విషయంపై న్యాయం చేయాలని రాష్ట్రంలో, ఢిల్లీలో నిరసనలు చేపట్టినప్పటికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఇటీవల బెల్లంపల్లిలో మాజీ ఎమ్మె ల్యే అనుచరులు దాడి చేసిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. అకారణంగా తనపై పోలీసులు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.



డిప్యూటీ సీఎంతో మాట్లాడుతున్న శేజల్

అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి



వాంకిడిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

వాంకిడి, జనవరి 3: ప్రభుత్వం 6 గ్యారంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రహీమొద్దిన్, ఎంపీడీవో శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సామెల, జంబుల్ ధరి, తేజాపూర్, గోయేగాం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా దరఖాస్తు చేయనివారు ఉంటే ఈనెల6వరకు మండలంలోని గ్రామపంచాయతీల్లో దరఖాస్తులు చేసుకో వాలన్నారు. దరఖాస్తుఫారాలు కొనవద్దని ప్రతి గ్రామపంచాయతీలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమాల్లో ఈజీఎస్ ఏపీవో శ్రావణ్, ఐకేపీ ఏపీఎం మహేష్, వ్యవసాయ అధికారి మిలింద్ కుమార్, మిషన్‌భగీరథ డీఈ ఇర్ఫాన్, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగాపూర్, కోర్సిని, బాలాజీ అనుకోడ గ్రామాల్లో బుధవారం ఆయన ప్రజలవద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు విలాస్, సుజాత, శ్యామల, ఉపసర్పంచ్ భాగ్య, శంకరయ్య, కార్యదర్శులు మల్లికార్జు, అశోక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: ప్రజాపాలనకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని హత్తిని, పీపీరావు కాలనీ, దిగిడ, ఖర్జిగ్రామాల్లో బుధవారం ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ కవిత ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని, తప్పులు లేకుండా పూర్తి చేసి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సరపంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎంపీడీవో మధసుదన్ మహగాం, పాములవాడ తదితర గ్రామ పంచాయతీ లను సందర్శించి ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు.

అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ



పెంచికలపేటలో అక్షింతలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పెంచికలపేట, జనవరి 3: మండలంలోని ఎల్లూరు అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం అయోధ్యరాముడి పూజితఅక్షింతలను 12గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, మధుకర్, వేణుగోపాల్, సత్యనారాయణ, నాగన్న, మహేష్, శ్రీని వాస్, రాజేశ్వర్, వెంకటాచలం పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్: అయోధ్యలోని శ్రీరామ మందిర అక్షింతలను బుధవారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తులకు పంపిణీ చేశారు. అక్షింతలు, చిత్రపటాలను ఈనెల 15వరకు ప్రతి ఇంటింటికి పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు వేణుగోపాల్, శ్రీరాములు, శ్రీనివాస్, సంతోష్, శ్రీకాంత్, సురేష్, తిరుపతి, మారుతి పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

వాంకిడి, జనవరి 3: చదువుల తల్లి, తొలి మహిళా అధ్యాపకురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతి ఉత్సవాలను బుధవారం మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాంకిడి ప్రాథమిక పాఠశాలతోపాటు వివిధ గ్రామాల్లో మాలి సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్, సంతన్ కుమార్, ఎన్ఎస్ఎస్ పీవో చంద్రయ్య, అధ్యాపకులు కిరణ్, శ్రీధర్, అశ్విని, ప్రాథమికపాఠశాల హెచ్‌ఎం వినేష్, మాలి సంఘం నాయకులు, గుర్నులే నారాయణ, గుర్నులే మెంగాజీ, వాడై బాబురావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం జిల్లాకేంద్రంలో బీసీసంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమెచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ సావిత్రిబాయిపూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వెంకన్న, జక్కయ్య, ప్రణయ్, మారుతి, ప్రశాంత్, తిరుపతి, శ్యాంరావు,మారుతి,సాగర్,బిక్కాజీ,నారాయణ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్ ఎక్స్‌రోడ్డులో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శంకర్, రేగుంటకేశవ్‌రావు,తిరుపతి, సోమయ్య పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని డబ్బా, ధరపల్లి ఎక్స్‌రోడ్, బారెగూడలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు సావిత్రిబాయి, జ్యోతిబాపూలే విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తిరుపతి, రాకేష్, సంజీవ్, సంతోష్, కృష్ణ, తిరుపతి, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో అధ్యక్షుడు జయదేవ అబ్రహం, కార్యదర్శి ఎం శివప్రసాద్ తదితరులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. అదేవిధంగా మోక్షిత డాన్స్ అకా డమీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మండలంలోని రాస్పెల్లిలో ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు ఏటుకూరిశ్రీనివాస్,తదితరులు సావిత్రి బాయిపూలే గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెట్రోల్‌బంక్ హైస్కూల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాజం, బీసీస రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాడి శ్యాంరావు, ఆవుల రాజ్‌కుమార్, శ్రీకాంత్, దుసర్లాల్ మహేష్ పాల్గొన్నారు.

రెబ్బెన: మండలకేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే సేవాసమితి వ్యవస్థాపకుడు మోర్లే తిరుపతి సావిత్రిబాయి చేసిన సేవలను వివరించారు.కార్యక్రమంలో సర్పంచి వడై శాంత, గుర్నేలే సత్తయ్య, రాజేందర్, సాయి, శ్రీకాంత్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయనిర్మల, యాదగిరి, సుజాత, లక్ష్మి, నగేష్, భారతి, శ్రీధర్‌లు పాల్గొన్నారు.


కౌటాల: మండలకేంద్రంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ గణేష్, మాలిసంఘం నాయకులు పాల్గొన్నారు.




చింతలమానేపల్లి, బెజ్జూరులో నివాళులు అర్పిస్తున్న నాయకులు, గ్రామస్థులు

జైనూర్: మండలకేంద్రంతోపాటు స్థానిక జూనియర్ కాలేజీలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని అధ్యాపకులు, మాలిసంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. అంతకు ముందు స్థానిక సర్పంచ్ మెస్రం పార్వతిబాయితో కలిసి మాలి సంఘం రాష్ట్రఅధ్యక్షుడు పెట్కులే సుకుమార్ జ్యోతిబా పూలే,సావిత్రి బాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


కెరమెరి: మండల కేంద్రంలో మాలి సంక్షేమ సంఘ కార్యాలయంను బుధవారం ప్రారంభించారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు తుకుసీరాం, తిరుపతి, నారాయణ పాల్గొన్నారు.




రెబ్బెనలో..



ఆసిఫాబాద్‌లో..



కౌటాలలో..



కెరమెరిలో..

విద్యుదాఘాతంతో రైతు మృతి

సిర్పూర్(టి), జనవరి 3: మండలంలోని పారిగాం గ్రామానికి చెందిన రైతు నాగపురె రమేష్(54) బుధవారం విద్యా ఘాతంతో మృతిచెందాడు. ఎస్సై దీకొండ రమేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపురె రమేష్ ఎప్పటిలాగే తనపొలంలో వరిపంటకు నీటిని పెట్టేందుకు పంపును ఆన్ చేశాడు. కరెంటుపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు కరెంటు ఉందా లేదా అని చూడడానికి వెళ్లాడు. అక్కడ ఒకవైపు వేలాడుతున్న వైరు రమేష్‌కు తగిలి అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై దీకొండ రమేష్

ఇద్దరి బైండోవర్

దహెగాం, జనవవరి 3: మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన ఇద్దరిని తహసీల్దార్ కవిత ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గత ఎన్నికల సమయంలో పార్టీలపరంగా దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సత్ప్రవర్తనతో మెలగాలని తహసీల్దార్ వారికి సూచించారు.

నేడు నరేంద్ర మహరాజ్ పాదుక దర్శనం

కౌటాల, జనవరి 3: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో గురువారం నరేంద్రమహరాజ్ పాదుక దర్శనం కార్యక్రమం ఉన్నట్లు జిల్లా ఇన్‌చార్జి గైక్వాడ్, పండరిక్ తెలిపారు. గురువారం ఉదయం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం పాదుక దర్శనం, ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి ఆన్‌లైన్‌లో ప్రవచనాలు అందజేస్తారన్నారు. ఈమేరకు మినీస్టేడియంలో ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాల్లో సత్తా చాటాలి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 3: ఈనెల 4నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసానిలో జరుగనున్న రాష్ట్రస్థాయి ఆశ్రమ పాఠశాలల క్రీడోత్సవాల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని గిరిజన సంక్షేమ ఉపసంచాలకురాలు రమాదేవి కోరారు. బుధవారం క్రీడోత్స వాలకు వెళ్తున్న బస్సును ఆమె జెండా ఊపి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, జీవరత్నం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత-చేవెళ్లపై చిగురిస్తున్న ఆశలు


నెన్నెల మండలం దుబ్బపల్లి వద్ద చేపట్టిన టన్నెల్ పనులు (ఫైల్)

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో కదలిక
- కాళేశ్వరం కుంగుబాటుతో ప్రత్యామ్నాయం దిశగా చర్యలు
- ప్రాజెక్టు పూర్తయితే తీరనున్న సాగునీటి కొరత
- కలిసి రానున్న కాలువల నిర్మాణ ఖర్చు

మంచిర్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు సాగు నీరందించే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ హయాంలో నిర్మించదలచిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంపై ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసినట్లయింది. కాళేశ్వరం నిర్మాణంతో ప్రాణహిత ప్రాజెక్టుకు సంబంధించిన క్యాంపులను ఇప్పటికే ఎత్తివేయగా, టన్నెల్ పైపులను కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వెనక్కి కూడా తీసుకెళ్లింది. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే 30 కిలోమీటర్ల మేర కాలువలు తవ్వడానికి రూ. 639 కోట్లు వెచ్చించగా, కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకున్న పక్షంలో వెచ్చించిన మొత్తం తిరిగి ఉపయోగంలోకి రానున్నాయి.

సామగ్రి వెనక్కి..

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించిన సామగ్రి వెనక్కి మళ్లుతుండడంతో భారీ మొత్తంలో నిధులు వృధా కానున్నాయి. మహారాష్ట్రలోని భూముల ముంపు వంకతో తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా దిగువన ఉన్న కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించారు. ఓ వైపు పూర్వ ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం జరగదని అంటూనే...కాళేశ్వరం పనులు పూర్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు కోసం నాలుగు ప్యాకేజీల్లో వందల కోట్లతో చేపట్టిన పనులను గుత్తేదార్లు అర్ధాంతరంగా వదిలి వేశారు.

71 కిలో మీటర్లమేర కాలువలు నిర్మించాల్సి ఉండగా రూ. 639 కోట్లతో 30 కిలోమీటర్ల మేర కాలువలు తవ్వి పనులను మధ్యలో వదిలేశారు.


నెన్నెల మండలం మైలారం క్యాంపు నుంచి టన్నెల్ పైపులను తరలిస్తున్న లారీలు (ఫైల్)

రెండు జిల్లాల పరిధి లోని కర్జెల్లి, సల్లుపల్లి, జిల్లెడ, కర్జి, జంగాల్‌పేట, కుశ్నపల్లి, మైలారం, దుబ్బపల్లి, తదితర ప్రాంతాల్లో చేపట్టిన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రాజె క్టుకు పునర్జీవనం పోస్తే ఇప్పటి వరకు నిర్మించిన కాలువలు ఇతర పనులు తిరిగి ఉపయోగంలోకి వచ్చే అవకాశాలు ఉండగా, ప్రాజెక్టు కోసం వెచ్చించిన రూ. వందల కోట్ల ప్రజాధనం ప్రజా ప్రయోజనార్థం వినియోగించినట్లు అవుతుంది.


అర్ధాంతరంగా నిలిచిపోవడంతో..

ప్రాణహిత- చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో అందుకోసం వెచ్చించిన రూ. 639 కోట్లు వృథా అయ్యే పరిస్థితులు నెలకొ న్నాయి. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నాలుగు ప్యాకేజీల్లో దాదాపు రూ. 639 కోట్లతో చేపట్టిన పనులను అర్ధాంతరంగా వదిలేసిన గుత్తేదార్లు టన్నెల్ భారీ ఇనుప పైపులను వెనక్కి తరలించుకుపోయారు.

నెన్నెల మండలం మైలారం వద్ద ఏర్పాటు చేసిన భారీ పైపుల నిర్మాణ కేంద్రాన్ని ఎత్తివేయగా, కాంక్రీటు మిక్చర్ ప్లాంటును కూడా తరలించుకుపోయారు. దీంతో ఏళ్లుగా సాగునీటిపై అన్నదాతలు పెట్టుకున్న ఆశలు ఆవిరి కాగా, ఒక దశలో ప్రాజెక్టు కథ కంచికి చేరినట్లేనన్న ప్రచారం జోరుగా సాగింది. అయితే అనూహ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు మళ్లీ జీవకల సంతరించుకుంది.

మరోవైపు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం కుంగిపోవడం కూడా దీనికి ఆజ్యం పోస్తోంది. ఇదిలా ఉండగా తమ ప్రభుత్వ హయాంలో నిర్మించతలపెట్టిన ప్రాజెక్టు కావడం, నీళ్ల ఎత్తిపోసేందుకు విద్యుత్ బిల్లుల రూపంలో నయా పైసా వెచ్చించాల్సిన అవసరం లేకపోవడం, గ్రావిటీ ద్వారా దిగువకు నీరు కాలువల గుండా తరలించే అవకాశం ఉండడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవేళ్ల వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.

ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకం


ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రూటు మ్యాపు

16.4 లక్షల ఎకరాల ఆయకట్టు..

ఉమ్మడి జిల్లా పరిధిలోని 16.4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే లక్ష్యంతో ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. రూ. 38,500 కోట్ల అంచనా వ్యయంతో 160 టీఎంసీల సా మర్థ్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం పథకానికి శ్రీకారం చుట్టింది. ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మించి టన్నెళ్లు, లిఫ్టులు, రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీటిని తరలించాలని సంకల్పించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని సిర్పూర్, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లోని 8 మండ లాల్లో 56,800 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక తయారు చేశారు. పనులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంఖుస్థాపన చేశారు. పనులను 28 ప్యాకేజీలుగా విభజించి వివిధ కాంట్రాక్టింగ్ కంపెనీలకు అప్పగించారు. మంచిర్యాల జిల్లాలో 5 ప్యాకేజీల్లో 125 కిలో మీటర్ల మేర కాలువల నిర్మాణం చేపట్టవలసి ఉంది. ఒకటవ ప్యాకేజీలో కౌటాల మండలం రణవెల్లి నుంచి ప్రారంభమైన కాలువ నిర్మాణం బెజ్జూర్ మండలం కర్జెల్లి దాటింది. దహెగాం, నెన్నెల మండలంలో పనులు చేపట్టారు. నెన్నెల మండలం మైలారం వద్ద టన్నెల్ నిర్మాణ పనులు చేపట్టారు. భారీ ఇను ప పైపులను 24 వరుసలతో 5 కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. 5 ప్యాకేజీల ద్వారా చేపట్టిన పనుల్లో భూములు కోల్పోయిన వారికి 75 శాతం వరకు పరిహారం కూడా అంద జేశారు.

అప్రమత్తతోనే నేరాల నియంత్రణ

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమ రాజేశ్వరి

కోల్‌సిటీ, జనవరి 3: అప్రమత్తతోనే నేరాల నియంత్రణ సాధ్యమని రామగుండం పోలీస్ కమిషనర్ రెమ రాజేశ్వరి అన్నారు. బుధవారం సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలో పాఠశాలలు, కళాశాలల్లో ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో ఓటీపీ ఫ్రాడ్స్, బయోమెట్రిక్, క్రెడిట్ కార్డ్స్, రిలేటెడ్‌కార్డ్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ఫెడెక్స్ కొరియర్, ఫ్రెడ్స్ లోన్ యాప్, నకిలీ సిమ్‌కార్డుల గురించి తెలిపామన్నారు. సైబర్ నేరాలకు గురైతే సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్ , సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నెం. 1930 గురించి తెలిపామన్నారు. సెల్‌ఫోన్ వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో అన్నీ అనర్థాలు కూడా జరుగుతున్నాయని, ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ ఫోన్ల వినియోగంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన

జైపూర్, జనవరి 3: మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు బుధవారం ఎస్సై ఉపేందర్ అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ క్రైంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండి తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు.. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నెపల్లి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని సాలిగామ్ మేరిమాత స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు

క్యాలెండర్ ఆవిష్కరణ

జైపూర్, జనవరి 3: జైపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలిష్ మాధుర్య, రవి, సత్తయ్య, మండల అధ్యక్ష, కార్య దర్శులు రాంనారాయణ, రాజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు ఘన నివాళి


పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు

మందమర్రి టౌన్, జనవరి 3: దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత నోముల ఎల్లాగౌడ్ వర్ధంతిని బుధవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు నూకల రమేష్, నోముల ఉపేందర్‌గౌడ్, ఎన్ శ్రీనివాస్, రజిని, భాస్కర్, రమేష్, కాంపెల్లి సమ్మయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ అక్షింతలతో శోభాయాత్ర


శ్రీరామ అక్షింతలతో శోభాయాత్ర చేపడుతున్న గ్రామస్థులు

దండేపల్లి, జనవరి 3: దండేపల్లి బస్టాండ్ నుంచి శ్రీరామరాలయం వరకు అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరామ పూజిత అక్షింతల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో దండేపల్లిలో రామాలయ కమిటీ భక్తులు, అయోధ్య శ్రీరామ మందిరం నుంచి వచ్చిన రాములోరి అక్షింతలను మహిళలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అయోధ్య శ్రీరాముని అక్షింతలను ఈనెల 15వ తేదీలోగా ఇంటింటికీ వెళ్లి అందజేస్తామని రామాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దండేపల్లి రామాలయ కమిటి నిర్వహకులు, భక్తులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్ప స్వాములు

శ్రీరాంపూర్, జనవరి 3 : శ్రీరాంపూర్‌కు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు బుధవారం శబరిమలకు తరలివెళ్లారు. ఏబీఏపీ శ్రీరాంపూర్ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వంగ శివకుమార్ ఆధ్వర్యంలో స్వాములు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఇరుముడి ధరించి శోభాయాత్రగా తరలివెళ్లారు. కార్యక్రమంలో ఏబీఏపీ సభ్యులు చందర్, రవికృష్ణ, రంజిత్, సురేందర్, తదితరులు ఉన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

జన్నారం, జనవరి 3: మండల సర్వసభ్య సమావేశం బుధవారం కోరంలేక వాయిదా పడింది. ఎంపీటీసీలు ఇద్దరు, సర్పంచులు ముగ్గురు మాత్రమే హాజరుకావడంతో ఎంపీడీవో అరుణారాణి, ఎంపీపీ మాదాడి సరోజన సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం నడుస్తున్న దృష్ట్యా ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో గ్రామ సభల్లోనే ఉండిపోయారని తెలిపారు. తదుపరి సమావేశాన్ని నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ వేణుగోపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై అవగాహన

హాజీపూర్, జనవరి 3: సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపైన టీకాణపల్లిలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కల్పించారు. ఆటపాటల ద్వారా పథకాల గూర్చి వివరించారు. డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన ద్వారా అభయహస్తం దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తిస్తారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారు రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సారథి కళాకారులు లావుడ్యా రమేష్, ముల్కల్ల మురళి, మామిళ్ల లచ్చన్న, వెళ్తూరు పోశం, కొప్పర్తి రవీందర్, భీరుపూరి శ్రీనివాస్, సల్లూరి కిష్టయ్య, రామటెంకి రాజాతిరుపతి, గొడిసెల క్రిష్ణ, లింగంపల్లి రాజేష్, నాగలక్ష్మి, సంధ్య, నిరోషా యాదవ్, సమీరా, రవికుమార్, సంతోష్, సుధాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏసీసీ, జనవరి 3: సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడిగా నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్ష ద్వారా సాంఘిక, గిరిజన, వెనుకబడిన, సాధారణ గురుకుల విద్యా సంస్థల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఐదోతరగతిలో ప్రవేశాలకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధికారుల సంయుక్త సర్వే

భీమారం, జనవరి 3: మండల కేంద్రంలోని ఊర చెరువు హద్దులు గుర్తించేందుకు నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు బుధవారం సంయుక్తంగా సర్వే చేశారు. భీమారం మండల కేంద్రంలోని మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిలో బస్టాండ్ సమీపంలో సర్వే నంబర్ 570లో 14 ఎకరాల భూమిలో చెరువు నిర్మాణం ఉండేది. అయితే చెరువు ఆక్రమణకు గురవుతుందని రెడేళ్ల క్రితం రాష్ట హైకోర్టులో కేసు వేశారు. అప్పట్లో కలెక్టర్ భారతీ హోళికేరీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో స్వయంగా హాజరై సర్వే నిర్వహించారు. సరిహద్దు రాళ్లు పాతాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా అది కార్యరూపం దాల్చలేదు. మండల కేంద్రానికి చెందిన మరో వ్యక్తి ఫిర్యాదు చేయడంతో అధికారులు బుధవారం సర్వే చేపట్టారు. పూర్తి స్థాయిలో హద్దులు నిర్ణయించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శారద, తహసీల్దార్ విశ్వంబర్‌తో పాటు సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కాంగ్రెస్ అండ


బెజ్జాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

జైపూర్, జనవరి 3: పేదలకు కాంగ్రెస్ సర్కారు అండగా ఉంటుందని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని బెజ్జాల, పౌనూరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పర్చడానికే ఈ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టిందన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి, స్థానికులకే ఎస్‌టీపీపీలో ఉద్యోగావకాశాలు ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగానే ప్రజా పాలన ప్రవేశపె ట్టిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యులు నూకల రమేష్ తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని 8వ వార్డులో ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు అందజేశారు.

దండేపల్లి: తాళ్లపేట, రాజుగూడ, ముత్యంపేట, కోర్విచెల్మ గ్రామా ల్లో ఆరు గ్యారంటీల దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి, తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో మల్లేషం పాల్గొన్నారు.

కాసిపేట: దేవాపూర్, మద్దిమాడ, గట్రావుపల్లిలలో లబ్ధిదారుల నంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీ వో అలీం, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.